క్లుప్తంగా

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ


ద్విచక్రవాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్

సింహాచలం: రోడ్డు ప్రయాణించేటప్పుడు ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పెందుర్తి ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్ సూచించారు. పెందుర్తి బీఆర్‌టీఎస్ రోడ్డులో ఆదివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే లాభాలను ఎస్‌ఐ వివరించారు. ఫ్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చిన్నపాటి నిర్లక్ష్యం ప్రాణాలనే హరిస్తుందని తెలియజేశారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల 2022 సంవత్సరంలో నగరంలో 147మంది ద్విచక్రవాహనదారులు ప్రాణాలు కోల్పోయారని తెలియజేశారు. ప్రతీ ఒక్కరూ హెల్మెట్ ధరించి సురక్షితమైన ప్రయాణం సాగించాలని సూచించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న పలువురు ద్విచక్రవాహనదారులను ఆపి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రామాలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: దేశపాత్రునిపాలెంలో శ్రీ సీతారాముల ఆలయ పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 79 వార్డు ఇన్‌చార్జి అప్పికొండ మహాలక్ష్మినాయుడు, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, నాయకులు కర్రి వినోద్, డీవీ రమణ, అచ్యుతరావు, రాధాకృష్ణ, ప్రసాద్, సురేష్ పాల్గొన్నారు.

సండే సందడి


తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: తిక్కవానిపాలెం తీరం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు జీడితోటలు, చెట్ల నీడన, టెంట్లు, వంతెన దిగువ కాలక్షేపం చేశారు. సాయంత్రం ఇసుక తిన్నెలపై కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ వంటి ఆట పాటలతో ఎంజాయ్ చేశారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో సరదాగా గడిపారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి


సమావేశంలో పాల్గొన్న ధర్మ ప్రచారక్ సాయిరాం

పరవాడ: హిందూ ధర్మాన్ని రక్షించే బాధ్యత గ్రామ ధార్మిక జట్లపై ఉందని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మ ప్రచారక్ ముద్దు సాయిరాం అన్నారు. వాడచీపురుపల్లి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఫౌండేషన్ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాల కేంద్రంగా పౌర్ణమి రోజు సామూహిక హారతి, ఏకాదశికి నగర సంకీర్తన, వారానికి ఒక సారి భజన, ఇంటింటా ధర్మ ప్రచారం వంటి కార్యక్రమాలను గ్రామాల్లో నిర్వహించడం ద్వారా భక్తి భావం పెంపొందించడం సాధ్యపడుతుందని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆడారి గంగాధర్, కర్రి రాజు, దాసరి రాము, వెన్నల అప్పలనాయుడు, బీసీ సంక్షేమ సంఘ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కూండ్రపు కృష్ణంనాయుడు, ప్రతినిధులు ఉమామహేశ్వరి, వెంకునాయుడు, కె.అప్పలనాయుడు, లాలం ఈశ్వరరావు పాల్గొన్నారు.

వికసించిన విద్యాకుసుమాలు

పదిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పది ఫలితాల్లో దుమ్ము లేపారు. రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లలో అన్ని వసతులు కల్పించడంతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించడం సత్ఫలితాలిచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా అత్యధిక మార్కులు సాధించి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మార్కులు సాధించారు.

పరవాడ: మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ప్రతిభ చూపారని మండల విద్యాశాఖ అధికారి ఎం.సునీత చెప్పారు. గతేడాది పదో తరగతి పరీక్ష ఫలితాలు 61 శాతం కాగా ఈ ఏడాది 78 శాతం నమోదైంది. పదో తరగతి పరీక్షలకు 830 మంది విద్యార్థులు హాజరు కాగా 648 మంది ఉత్తీర్ణత సాధించారు. తానాంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఆర్.నీక్షిత 586 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. పెదముషిడివాడ జెడ్పీ పాఠశాలకు చెందిన ఎస్.తేజస్విని 581 మార్కులు సాధించింది. లంకెలపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన గుర్రం గీతాచరణ్ 574 మార్కులు సాధించాడు. అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు మధ్య తరగతి కుటుంబాల నుంచి వచ్చిన వారే కావడం విశేషం.

ఇంజినీర్ కావాలన్నదే ధ్యేయం


రొంగలి నీక్షిత, తానాం

తానాం గ్రామానికి చెందిన రొంగలి అప్పారావు సత్యవతి దంపతుల కుమార్తె అయిన నీక్షిత పదో తరగతి పరీక్షల్లో 586 మార్కులు సాధించింది. తండ్రి అప్పారావు ఫార్మాసిటీలో కార్మికుడు కాగా తల్లి గృహిణి. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా విని ఇష్టపడి చదవడంతో మంచి మార్కులు వచ్చాయి. ట్రిపుల్ ఐటీలో చేరి ఇంజినీర్ కావాలన్నదే తన ధ్యేయమని తెలిపింది.

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా


ఎస్.తేజశ్విని, పెదముషిడివాడ

పెదముషిడివాడ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ వెంకటరమణ, కనకమహాలక్ష్మిల కుమార్తె తేజశ్విని జెడ్పీ పాఠశాలలో చదువుతూ ఈ ఏడాది 581 మార్కులు సాధించి మేటి విద్యార్థిగా నిలిచింది. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతోనే మంచి మార్కులు వచ్చాయని చెప్పింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలన్నదే తన లక్ష్యమని వివరించింది.

ఇంజినీర్ అవుతా..



ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దార పుష్పాంజలి పదోతరగతి ఫలితాల్లో 570/600 మార్కులు సాధించింది. స్వగ్రామం బంగారమ్మపాలెం గ్రామం శివారు ఎ. శిరసపల్లి. తండ్రి దార రాము ఆటో డ్రైవర్ కాగా తల్లి దార లక్ష్మీ భారతి గ్రామ వలంటీర్‌గా పనిచేస్తుంది. ఇంజినీర్ కావడమే తన లక్ష్యమని పుష్పాంజలి చెబుతుంది.
–దార పుష్పాంజలి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ఆరిపాక

ఉపాధ్యాయుల ప్రోత్సాహం



ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి. వర్షిత పదోతరగతి ఫలితాల్లో 565/600 మార్కులు సాధించింది.స్వగ్రామం ఆరిపాక. తండ్రి పార్వతీశం మెకానిక్ కాగా తల్లి దేవి టైలరింగ్ చేస్తుంది. ఉపాధ్యాయుల ప్రోత్సాహం వల్లే తనకు మంచి మార్కులు వచ్చాయని వర్షిత చెబుతోంది.
–పి వర్షిత,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ఆరిపాక.

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా ..



లంకెలపాలెం దరి గంజిపేటకు చెందిన గుర్రం గీతాచరణ్ తండ్రి నరసింగరావు ఎన్టీపీసీలో కాంట్రాక్టు కార్మికుడు కాగా తల్లి లక్ష్మి ఫార్మాసిటీలో హౌస్ కీపర్‌గా పనిచేస్తుంది. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను విని గుర్తు పెట్టుకొని పరీక్షలో మంచి దస్తూరీతో రాశాను.దీంతో 574 మార్కులు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం. – గుర్రం గీతా చరణ్

దేవీపురం క్షేత్రంలో ప్రత్యేక పూజలు


అమ్మవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాపురంలోని జనతాకాలనీలో జయదుర్గ పీఠాన్ని గురూజీ అమృతానంద స్వామీజీ 20 సంవత్సరాల కిందట స్థాపించారు. నాటి నుంచి ఏటా మే 7వ తేదీన అక్కడి భక్తులు జయదుర్గా అమ్మవారిని ఊరేగింపుగా దేవీపురంలోని పుట్టింటికి తీసుకురావడం ఆనవాయితీగా జరుగుతుంది. దీనిలో భాగంగా మరియ దాసు,ఆడారి అప్పారావు తదితరులు కమిటీ తరపున వచ్చి అమ్మవారికి క్షీరాభిషేకం,షోడశోపచార పూజ,లలితా సహస్రనామ పారాయణం చేయించారు. ఇటు వంటి కార్యక్రమాలు మంచి పరిణామానికి దారితీయడమే కాకుండా ప్రపంచ శాంతికి దారితీస్తాయని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. సాయంత్రం మళ్లీ జయదుర్గా అమ్మవారిని పల్లకీలో ఊరేగింపుగా మల్కాపురంలోని జనతా కాలనీకి తీసుకువెళ్లారు.

జాతీయ భావాలతో బీఎంఎస్ అడుగులు


సమావేశంలో పాల్గొన్న బీఎంఎస్ నాయకులు, కార్యకర్తలు


మాట్లాడుతున్న బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయ పాండ్య

అక్కిరెడ్డిపాలెం: భారత ప్రభుత్వంలో అత్యధిక సభ్యత్వం కలిగిన సంఘంగా భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) గుర్తింపు పొందిందని బీఎంఎస్ జాతీయ అధ్యక్షుడు హిరణ్మయ పాండ్య అన్నారు. 69వ వార్డు షీలానగర్ బీవీకే స్కూల్ ఆడిటోరియంలో ఆదివారం బీఎంఎస్ ఎల్ 20 జన భాగీధారీ సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన బీఎంఎస్ జాతీయ్య అధ్యక్షుడు హిరణ్మయ పాండ్య, ఇతర నాయకులు భారతమాత, విశ్వకర్మభగవాన్, బీఎంఎస్ వ్యవస్థాపకుడు దత్తోపత్ తెంగడి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న పాండ్య మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో కార్మిక సంఘాలను నడిపించే రెండు ఫెడరేషన్లు డబ్ల్యూఎఫ్‌టీయూ, ఐటీయూసీ పనిచేస్తున్నాయన్నారు. జాతీయ భావాలతో పనిచేస్తున్న బీఎంఎస్ మాత్రం విదేశీ భావజాలాలకు అతీతంగా ఐటీయూసీకు , డబ్ల్యూఎఫ్‌టీయూకి అనుబంధంగా కాకుండా స్వతంత్రంగా పని చేస్తోందన్నారు. ఎల్ 20 ప్రారంభం నుంచి ఏ దేశంలో సమావేశాలు జరిగినా ఐటీయూసీ వారే అధ్యక్ష స్థానం వహిస్తున్నారని తెలిపారు. జీ 20 అధ్యక్ష స్థానం భారతదేశానికి వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం దేశంలో అతిపెద్ద కార్మిక సంఘానికి ఎల్ 20 అధ్యక్ష స్థానం ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు, ఏపీ బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి ఎం.వి.ఎస్.నాయుడు, బీఎంఎస్ ఏపీఎస్ ఆర్టీసీ ఆర్‌హెచ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏపీ అధ్యక్షుడు వి.వి.కె.రాయ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్.నరేంద్ర, కోశాధికారి ఎల్.ప్రసాద్, భెల్ (హెచ్‌పీవీపీ) నాయకులు చిన్నబాబు, టి.నూకినాయుడు తదితరులు పాల్గొన్నారు.

10న విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు

గాజువాక: విద్యుత్ వినయోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈనెల 10న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. గాజువాక సబ్ డివిజన్‌లోని బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్‌లో ఉదయం పది గంటలనుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగనున్నట్టు తెలిపారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, నూతన సర్వీసులు, నియంత్రికల ఏర్పాటు, మార్పులు, బిల్లుల సవరణ, ఇతర సమస్యలపై అవగాహన కల్పించనున్నట్టు పేర్కొన్నారు. గాజువాక, చినగంట్యాడ, మింది సెక్షన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ సదస్సుకు హాజరై విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సదస్సుకు సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు.

ముగిసిన మేడే వారోత్సవాలు


అంబేడ్కర్ కూడలిలో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిటు నాయకులు

తగరపువలస: భీమిలి డివిజన్ సిటు ఆధ్వర్యంలో అంబేడ్కర్ కూడలిలో మే డే వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ప్రజానాట్య మండలి కళాకారులతో గురజాడ అప్పారావు నాటిక, ఉత్తరాంధ్ర జానపద కళాకారుడు బొట్టతవుడు బృందం జానపద గీతాలు ఆలపించారు. చిప్పాడ పంచాయతీ ఆశిపాలెం సుత్తమ్మతల్లి బృందంచే తప్పెటగుళ్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. టి.నగరపాలెం శ్రీరామ కోలాట బృందంచే ప్రదర్శన, సిటు కళాకారుల డప్పు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు, సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు ఆర్ఎస్ఎన్ మూర్తి, ఎస్.అప్పలనాయుడు, రవ్వ నరసింగరావు, కె.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరేకృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణ, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలు వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

వెన్నలపాలెంలో గడప గడపకు..

పరవాడ: వెన్నలపాలెం గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు వైస్ ఎంపీపీలు పాల్గొంటారని చెప్పారు. మండలంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు పాల్గొని విజయవంతం చేయాలని రామారావు కోరారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్త దానం చేస్తున్న దృశ్యం

సింహాచలం: పెందుర్తి నాలుగురోడ్ల జంక్షన్‌లో ఆదివారం పెందుర్తికి చెందిన సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 67 మంది రక్తదానం చేశారు. అమ్మ బ్లడ్ బ్యాంక్ నిర్వాహకులు రక్తాన్ని సేకరించారు.ట్రస్ట్ అధ్యక్షుడు దాడి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించిన అన్విష్‌వర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో దాడి రమణచిట్టి, ట్రస్ట్ సభ్యులు పి.ఉమాశంకర్, రవి, సీరపు మహేశ్వరావు, సన్నీ యాద్, వేగి వాసు, సిరిమల్ల గణేష్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు కోసం ఉద్యమించాలి


దీక్షలో పాల్గొన్న నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రజలందరి ఆస్తి అని, కాపాడుకునేందుకు ప్రతి తెలుగువాడు ఉద్యమించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 815వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన హెచ్ఎస్ఎం యూనియన్ కార్మికులు పాల్గొని ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కార్మికులందరు ఏకతాటిపై ఉద్యమించాలన్నారు.

ఘనంగా విశ్వకవి ఠాగూర్ జయంతి


రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆచార్య వెంకటేశ్వర్లు

ఏయూ క్యాంపస్: విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ వీఎస్ కృష్ణా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. రవీంద్రుని విగ్రహానికి గ్రంథాలయాధికారి ఆచార్య పి.వెంకటేశ్వర్లు పూలమాల వేసి, అంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశిష్ట రచనా శైలితో నోబెల్ బహుమతిని సొంతం చేసుకుని ఠాగూర్ భారతీయ సాహిత్య ప్రతిభను ప్రపంచానికి చాటారన్నారు. అటువంటి మహనీయుడు ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సైతం సందర్శించి, ప్రసంగించారని గుర్తు చేశారు. నేటి తరం విద్యార్థులు ఇటువంటి వారి రచనలను సమగ్రంగా చదవడం, అధ్యయనం చేయడం ఎంతో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాజగోపాల్, లైబ్రరీ అసిస్టెంట్స్, లైబ్రరీ టెక్నికల్ అసిస్టెంట్‌లు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి సహకారం అందిస్తా


పార్టీ నాయకులు,గ్రామ పెద్దలతో భూమి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- పలు ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపన

సింహాచలం: పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదివారం సబ్బవరం, పెందుర్తి, పరవాడ మండలాల్లో పర్యటించారు. పలు ఆలయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

- జీవీఎంసీ 95వ వార్డు లక్ష్మీపురంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బైలపూడి భగవాన్ జయరామ్, 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకులు కాళ్ల గంగాధర్, జోబ్‌దాస్, మాధవ్ రావు, సంతోష్, మురళి పాల్గొన్నారు.
- పాపయ్యరాజుపాలెంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నక్షత్రవనం, ఉద్యానవనాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పి.చిన్నబాబు, సత్తిబాబు పాల్గొన్నారు.


ఉమారామలింగేశ్వరస్వామి ఆలయ వద్ద ఉద్యానవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

ఆధ్యాత్మిక భావంతో ప్రశాంతత

సబ్బవరం: ఆధ్యాత్మిక భావంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. సబ్బవరం మేజర్ పంచాయతీ పరిధిలోని ఆదిరెడ్డిపాలెంలో గ్రామ దేవత పరదేశిమాంబ ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, పార్టీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము, పార్టీ సంయుక్త కార్యదర్శి బయలపూడి భగవాన్ జయరాం, పార్టీ మండల కన్వీనర్ కర్రిబాబు, పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, సీనియర్ నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు ముత్యాలనాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి, ఆత్రేయ జీవితాలు ఆదర్శం


వ్యాసరచన పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న ఉదయ్‌కుమార్

సింహాచలం: అల్లూరి సీతారామరాజు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా పబ్లిక్ రిలేషన్ వర్కింగ్ చైర్మన్ వడ్డాది ఉదయ్‌కుమార్ అన్నారు. వేపగుంట ముత్యమాంబ ఆలయ ప్రాంగణంలో తెలుగువీరలేవరా సంస్థాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి, మనసుకవి ఆత్రేయ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి, ఆత్రేయ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాడేరు జిల్లాకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం శుభపరిణామమన్నారు. అలాగే చలచిత్ర రంగానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన మహోన్నత గేయరచయిత ఆత్రేయ అని కొనియాడారు. 1400 చిత్రాలకు ఆయన పాటలు రాశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. విద్యార్థులకు ఆత్రేయ, అల్లూరి జీవితచరిత్రలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగువీర లేవరా సంస్థాన్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ దొడ్డి శివకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలపై పోస్టు కార్డు ఉద్యమం

గాజువాక: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన పోస్టు కార్డు ఉద్యమాన్ని జయప్రదం చేయాలని గాజువాక ఏరియా ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు యు.వి.ఎస్.ఎన్.వర్మ కోరారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు చెల్లించాలని, ఈఎస్‌ఐ వైద్య సదుపాయం కల్పించాలని, వృద్ధులకు రైల్వేలో రాయితీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లపై చేపట్టిన పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రతి పెన్షనర్ జయప్రదం చేయాలని కోరారు. ఈ ఉద్యమంలో భాగంగా ఎంపీలను కూడా కలిసి సమస్యలను వివరించనున్నామన్నారు. సమావేశంలో నాయకులు ఎస్‌కే హుస్సేన్, కె.దీనబంధు, కె.వి.రమణ, ఎన్.సత్యనారాయణ, డి.వెంకటరావు, యు.వి.పి.రాజు, కె.కిరీటం తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలను భారతరత్నతో గౌరవించాలి


ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దాడి వీరభద్రరావు

మద్దిలపాలెం: అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావును భారతరత్నతో గౌరవించాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. ఘంటసాల ఆరాధకులు ,టెలిగ్రామ్ గ్రూప్ సభ్యుల సమర్పణలో ఘంటసాల ఆరాధనోత్సవాలను డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ విశ్వవిఖ్యాత స్వరమాంత్రికుడు ఘంటసాల స్వరం సుస్థిరమైదన్నారు. విశ్వం ఉన్నంత వరకూ ఘంటసాల స్వరం వినిపిస్తునే ఉంటుందన్నారు. అనంతరం డాక్టర్ సయ్యద్ రహమతుల్లా ఘంటసాల అవధాన ప్రక్రియను అద్భుతంగా నిర్వహించారు. ప్రేక్షకులు ఘంటసాల పాటలలో పల్లవి, చరణంలో ఏ ఒక్కటి అడిగిన తక్కున ఆ చిత్రం పేరు, స్వరపరిచిన సంగీత దర్శకుడు, చిత్రం విడుదల తేదీలతో సహా చెప్పడమే కాకుండా ఆ పాటను కూడా ఆలపించి ఔరా అనిపించారు. ఐదుగురు గాయనీమణులు, ఐదుగురు గాయకులతో నిర్వహించిన పాటల కబడ్డీ అలరించింది. అనంతరం ఘంటసాల నాటిక ప్రదర్శించారు. కార్యక్రమంలో విజయనిర్మాణ అధినేత సూరపనేని విజయకుమార్, డాక్టర్.కె.రామమూర్తి, బి.కల్యాణి తమ గానంతో అలరించారు.

నేటి నుంచి వేసవి శిక్షణ శిబిరం

సబ్బవరం: సబ్బవరం శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి వచ్చే నెల 11వ తేదీ వరకూ వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్టు సబ్బవరం శాఖా గ్రంథాలయ అధికారి వి. కుమారి శిరీష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చిత్రలేఖనం, కథల పోటీలు తదితర అంశాల్లో తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నిత్యావసర సరకుల పంపిణీ

సబ్బవరం: మండలంలోని రావులమ్మపాలెం గ్రేస్ ఆఫ్ గాడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం గొటివాడ కాలనీలో 30 నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులను ట్రస్ట్ చైర్మన్ పువ్వల విజయకుమార్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెలకు 30 మంది నిరుపేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.